ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్టం : 32.0
కనిష్టం : 24.0





• ముగిసిన దసరా సందడి

దసరా సందడి ముగిసింది. గురువారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఏలూరు ఫత్తేబాదలో అమ్మవారి ఊరేగింపు(చిత్రంలో) ఘనంగా జరిగింది.

• బ్రహ్మోత్సవ శోభ

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి, ఉభయ దేవేరులు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలయ్యారు. శుక్రవారం రాత్రి ధ్వజారోహణ వేడుక వైభవంగా జరిగింది.

డబుల్ జోష్

ద్వాక్రా మహిళలకు అండగా..

- ఎన్టీఆర్ విద్యాలక్ష్మి కల్యాణలక్ష్మికి శ్రీకారం
- జిల్లాలో 41,510 ద్వాక్రా సంఘాలు.. 4,09,235 మంది సభ్యులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి): ద్వాక్రా మహిళలను సమాజంలో ఉన్నతంగా నిలిపేందుకు టీడీపీ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతోంది. ఇప్పటికే ప్రభుత్వం శ్రీనిధి ద్వారా ద్వాక్రా మహిళలకు రూపాయి వడ్డీకి రుణాలు ఇస్తున్నారు. దసరా కానుకగా పొదుపు సంఘాలకు డబుల్ బొనాంజగా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకాలకు టీడీపీ సర్కార్ శ్రీకారం చుట్టింది. పిల్లలు చదువులు, పెళ్లిళ్లకు స్వల్ప కాలిక వడ్డీకే రుణాలు అందించేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయించారు. శ్రీ నిధి ద్వారా కనీసం రూ.10 వేలు మొదలుకుని గరిష్ఠంగా రూ.లక్ష వరకు సాయం అందించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. కేవలం పావలా వడ్డీతో తీసుకున్న రుణపరిమితి ఆధారంగా గరిష్ఠంగా 48 నెలల్లో చెల్లించే వెసులుబాటు కల్పించనున్నారు. జిల్లాలో 41,510 ద్వాక్రా సంఘాల్లో 4 లక్షల 9,235 మంది మహిళా సభ్యులున్నారు.

నిబంధనలు ఇవీ..

సంఘ సభ్యురాలిగా చేరి కనీసం ఆరు నెలలు పూర్తవాలి. ఇప్పటికే బ్యాంకు లింకేజీ శ్రీ నిధి, ఇతర మార్గాల్లో అప్పులు చెల్లించే వారికి.. బయోమెట్రిక్ ఆధారంగా అమలు చేస్తారు. ద్వాక్రా ద్వారా రుణాలు తీసుకుని, వాటిని సక్రమంగా చెల్లించాలి. చదువుకైతే గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు ఇస్తారు. ఆడపిల్ల వివాహానికి రుణం అందిస్తారు. చదువుకోవడానికి దరఖాస్తు చేసిన 48 గంటల్లోగా ఖాతాలో జమ



చేస్తారు. పెళ్లికి సంబంధించి తుది పరిశీలన చేసి జమ చేస్తారు. కల్యాణ లక్ష్మికి అవసరానికి అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం తీసుకునే వెసులుబాటు ఉంది.

ఉన్నత చదువులకు దోహదం



విద్యాలక్ష్మి కింద రుణాలను అందించాలని చంద్రబాబు నిర్ణయించడం శుభపరిణామం. మాకు పిల్లలకు ఈ విద్యాలక్ష్మి రుణాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

- జాలాది తిరుపతమ్మ, కొణిజర్ల

ఆడపిల్లల తల్లులకు మేలు



ద్వాక్రా సంఘంలో పదేళ్ల నుంచి రుణం తీసుకుంటున్నాను. నాకు ఇద్దరు ఆడపిల్లలున్నారు. కల్యాణ లక్ష్మి కింద రుణాలు అందనుండడం మా లాంటి వారికి వరం.

- మాకే సంగీత, లింగపాలెం

ఆటో డ్రైవర్ సేవలో..

- జిల్లాలో 10,655 మంది అర్హులు.. 271 మంది అనర్హులు
- నేడు లబ్ధిదారుల ఖాతాల్లో రూ.15వేలు చొప్పున జమ
- ఏర్పాట్లు చేసిన అధికారులు



ఆటోలో ప్రయాణిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

(ఏలూరు-ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్ల నుంచో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న ఆటోవాలాలకు 'ఆటో డ్రైవర్ సేవలో' పథకం కింద లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గతనెలలో ఈ పథకానికి శ్రీకారం చుట్టగా, 17 నుంచి 19వ తేదీ వరకు అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. గ్రామ,వార్డు సచివాలయాలకు వచ్చిన దరఖాస్తులను ఆయా కార్యాలయాల సిబ్బంది విచారణ చేసి,అర్హుల జాబితాలను మంజూరు కోసం పంపగా వాటికి గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో శనివారం లబ్ధిదా రుల ఖాతాల్లో రూ.15,000 జమ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 11,350 మంది ఆటోవాలా, క్యాబ్స్, టాక్సీల సంబంధించిన వారు దరఖాస్తు చేయగా, అందులో పరిశీలనలు తర్వాత 10,655 మంది అర్హులుగా లెక్క తేల్చారు. ఇందులో ఆటోవాలాలు, టాక్సీ లకు చెందిన 9,687 మంది, క్యాబ్స్ వాహనా లను కలిగిన వారికి 968 మందిని అర్హులుగా తేల్చారు. 271 మందిని అనర్హులుగా తేల్చారు.

వైసీపీ ప్రభుత్వంలో అరకొరగా..

గత వైసీపీ ప్రభుత్వంలో అరకొరగా రూ.10 వేలు జమ చేసినా ఆ తర్వాత ముక్కుపిండి వివిధ పన్నుల రూపేణ భారం మోపి లాగేసుకునేది. చివరి సంవత్సరం వాహనమిత్ర ఊసే లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాకా ఉచిత ఆర్టీసీ ప్రయాణాలతో తమకు సర్వీసులు లేక ఇక్కట్లు పాలవుతున్నామని ఆటోవాలాలు ఉద్యమించారు. ఈ తరుణంలో మిమ్మల్ని ఆదుకుంటామని టీడీపీ సర్కార్ భరోసా ఇచ్చింది. 15 రోజుల వ్యవధిలోనే ఆటోవాలాలకు మేలు చేకూర్చేలా ప్రభుత్వం వేగంగా అడుగులు వేసి వారికి లబ్ధి చేకూర్చనుండడంతో వారు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఏలూరుకు మంత్రి నాదెండ్ల రాక

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రాంగణంలో 'ఆటో డ్రైవర్ సేవలో'.. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేయనున్నారు.

సత్ప్రవర్తనతో జీవనం సాగించండి

ఖైదీలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి హితవు

మూటగట్టి గోదావరిలో పడేశారు

■ లోపలి పేజీలో..



• గాంధీజీకి ఘన నివాళులు

జిల్లావ్యాప్తంగా గురువారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహానికి కలెక్టర్ కె.వెట్రి సెల్వి పూలమాల వేసి నివాళి అర్పించారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం సాధించిన మహాత్మాగాంధీ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. డీఆర్వో విశ్వేశ్వర రావు, జడ్పీ సీఈవో శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలతలు పాల్గొన్నారు.

- ఏలూరు

మొబైల్స్ హ్యాక్.. రూ.4.52 లక్షలు మాయం

ఆకివీడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్‌లను హ్యాక్ చేసి.. వారి బ్యాంకు అకౌంట్‌ల నుంచి పెద్ద మొత్తం సొమ్ములు మాయం చేస్తున్నారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలివి.. ఏలూరు జిల్లా కొట్టాడకు చెందిన ఓ వ్యక్తి మొబైల్‌ను సైబర్ నేరగాళ్లు సెప్టెంబరులో హ్యాక్ చేశారు. అతనికి ఫేక్ మెసేజ్‌లు వస్తున్నా సరిగా గమనించలేదు. ఈ క్రమంలో శుక్రవారం అతని క్రెడిట్ కార్డు నుంచి లక్షా 52 వేల రూపాయలను రుణం కింద డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. అలాగే ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన మరొకరి మొబైల్ ఫోన్‌ను హ్యాక్ చేసి.. మీరు రుణం తీసుకున్నారంటూ అతని క్రెడిట్ కార్డు నుంచి రూ.3 లక్షలు మాయం చేశారు. వీరిద్దరూ లబోదిబోమంటూ ఆకివీడు బ్యాంకుకు వెళ్లి విషయం చెప్పడంతో వీరిద్దరి అకౌంట్‌ల నుంచి రూ.4,52,000 సైబర్ నేరగాళ్లు కొట్టేశారని బ్యాంకు అధికారులు తేల్చి చెప్పారు. తమ బ్యాంకులో ఇలా జరగడం ఇదే తొలిసారని బ్యాంకు మేనేజర్ స్పష్టం చేశారు. వీరిద్దరూ ఆకివీడు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అపరిచిత ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులపై క్లిక్ చేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

వైభవంగా ఆంధ్రా మైసూర్ దసరా ఉత్సవాలు

- జమ్మికొట్టి ఉత్సవాలను ప్రారంభించిన జమిందారీ వారసుడు ఎంఎంఆర్‌వీ అప్పారావు
- వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొలుసు

నూజివీడు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా మైసూరుగా పేరుగాంచిన నూజివీడు దసరా ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా దసరాని పురస్కరించుకుని గురువారం రాత్రి తెల్లవార్లు నూజివీడు పురవీధులు సందర్శకులతో కిటకిటలాడాయి. దాదాపు 50 వేల మందికి పైగా ఉత్సవాలను తిలకించారు. నూజివీడు కోటమహిషాసురమర్థిని, దుర్గామల్లేశ్వర స్వామివార్లు, వేణుగోపాలస్వామి, వెంకటాచల స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు నగరోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆయా దేవాలయాల నుంచి ఉత్సవ మూర్తులతో నెమలి, గరుడ తదితర వాహనాలతో రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమైన నగరోత్సవం తొలుత నూజివీడు జమిందారీ వారసుడైన ఎంఎంఆర్‌వీ అప్పారావు దివాణానికి వెళ్లి అక్కడ నుంచి సంప్రదాయ బద్ధంగా నగరోత్సవాన్ని నిర్వహించారు. జమిందారీ వారసులైన అప్పారావు తన నివాసంలో సంప్రదాయ జమ్మి పూజ, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి సతీసమేతంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నూజివీడు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు. నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యం లో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుట్టబొమ్మలు, బేతాళ నృత్యాలు, విచిత్ర వేషధారణలతో నిర్వహించిన ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్, ఏఎస్పీ సూర్యచంద్ర రావు, డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఉత్సవ మూర్తులకు నగరోత్సవం



జమ్మికొట్టి వేడుకలను ప్రారంభిస్తున్న ఎంఎంఆర్‌వీ అప్పారావు, మంత్రి కొలుసు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సాధించారు

- రెండు రాష్ట్ర, 51 జిల్లా స్థాయి అవార్డులు.. 6న అందజేత : కలెక్టర్



ఏలూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల అమలులో ఏలూరు జిల్లా అత్యుత్తమ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినందుకు రెండు రాష్ట్రస్థాయి, 51 జిల్లా స్థాయి అవార్డులను సాధించినట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వ చ్ఛాంధ్రలో జిల్లాలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమాల్లో స్థిరమైన పద్ధతుల్లో కొత్త ప్రమాణాలతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డులు వరించాయని తెలిపారు.

అవార్డుల వివరాలు..

- రాష్ట్రస్థాయి అవార్డుల్లో ఉత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా పి.అంకంపాలెం (జీలుగుమిల్లి)కి చెందిన ఎస్.సూరమ్మ.
- స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాలగా విప్పలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఎంపికైంది.

జిల్లాస్థాయి అవార్డుల్లో..

- ఉత్తమ స్వచ్ఛ పురపాలక సంఘంగా జంగారెడ్డిగూడెం..
- స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా కామయ్యపాలెం(జీలుగుమిల్లి), కన్నాపురం(కొయ్యలగూడెం), మారేడుపల్లి(ముసునూరు), చానమిల్లి (నిడమర్రు), చేబ్రోలు(ఉంగుటూరు) పంచాయతీలు ఎంపికయ్యాయి.
- ఉత్తమ స్వచ్ఛ స్లమ్ లెవెల్ ఫెడరేషన్స్‌గా జంగారెడ్డిగూడెంలోని ఇందిరా క్రాంతిపథం, ఏలూరులోని ఆదర్శ-2 స్లమ్ సమాఖ్య, నూజివీడులో రాజీవ్ సమాఖ్య.
- ఉత్తమ స్వచ్ఛ రైతుబజార్‌గా కలిదిండి,
- ఉత్తమ స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్‌గా సానరుద్రవరం(కలిదిండి), కాళ్లచెరువు (కామవరపుకోట), పెరికేగూడెం(మండవల్లి), వెంకటాయపాలెం(నూజివీడు), వెల్లమిల్లి (ఉంగుటూరు) అవార్డులు సాధించాయి.
- ఉత్తమ స్వచ్ఛ బస్‌స్టేషన్‌గా ఏలూరు బస్టాండ్
- ఉత్తమ స్వచ్ఛంద సంస్థల విభాగంలో రెడ్ క్రాస్, మానవత, పరివర్తన్ సంస్థలు.
- ఉత్తమ స్వచ్ఛ ఆసుపత్రులుగా కాగుపాడు (ఉంగుటూరు) పీహెచ్‌సీ, చాట్రాయి మండలం చిత్తపూర్ ప్రభుత్వాసుపత్రి.
- ఉత్తమ స్వచ్ఛ పాఠశాలలుగా ఆరుతీగలపాడు(కలిదిండి), జంగారెడ్డిగూడెం బాలుర జడ్పీ హైస్కూళ్లు, ఏలూరు పాండురంగా స్పెషల్ మునిసిపల్ ప్రైమరీ స్కూల్, ఈస్ట్ దిగవల్లి(నూజివీడు)లోని ఎంపీపీ పాఠశాల, వేలేరుపాడు కేజీ వీబీ పాఠశాల.
- ఉత్తమ స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలుగా తిరుమలంపాలెం (ద్వారకాతిరుమల), అంబర్‌పేట(భీమడోలు), ఏలూరు, చింతలపూడి, కొవ్వలి(దెందులూరు) అంగన్‌వాడీ కేంద్రాలు.
- స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలుగా ఏలూరు కార్పొరేషన్, జడ్పీ కార్యాలయం, మైనార్టీస్ సంక్షేమ శాఖ
- స్వచ్ఛ పరిశ్రమల విభాగంలో నవభారత్ ఆగ్రో ప్రొడక్ట్స్ కంపెనీ
- ఉత్తమ స్వచ్ఛ ఎంఎస్ఎంఈ విభాగంలో ఏలూరు గ్రోవెల్ ప్రాసెసర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్.
- ఉత్తమ స్వచ్ఛ హాస్టళ్లుగా పెద నింద్రకొలను (నిడమర్రు) సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్, ఏలూరు ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్-2, లంకపల్లి (బుట్టాయగూడెం) జీటీడబ్ల్యూ బాలికల ఆశ్రమ పాఠశాల
- ఉత్తమ స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాల విభాగంలో బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెంలోని జీటీడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాలలు అవార్డులు పొందాయి.
- ఉత్తమ స్వచ్ఛ పారిశుధ్య కార్మికులుగా ఏలూరులో సాక (మిగతా 8వ పేజీలో)



వరద ముంపు నుంచి బయటపడ్డ రుద్రమ్మకోట రహదారి

తగ్గుతున్న గోదావరి వరద

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ నుంచి వచ్చే వరద తగ్గుముఖం పట్టడంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద తగ్గుముఖం పడు తోంది. గురువారం వరకు వరద చుట్టుముట్టిన కారణంగా 24 గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోగా శుక్రవారం నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో వేలేరుపాడు, రేపాకగొమ్ము, రుద్రమ్మకోట, వేలేరుపాడు, కోయిదా, ప్రధాన రహదారి పైన కొన్నిచోట్ల వరద తగ్గడంతో రాకపోకలు ప్రారంభించారు. ఆదివారం నాటికి గ్రామాలను చుట్టుముట్టిన వరద పూర్తిగా తగ్గిపోయి గోదావరి నది సాధారణ ప్రవాహస్థాయికి చేరుకునే అవకాశాలున్నట్టు అంచనా వేస్తున్నారు. తెలంగాణలోని భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం 36.70 అడుగుల నీటిమట్టం నమోదు కాగా సాయంత్రానికి 37.50 అడుగుల నీటిమట్టం నమోదైంది. వరద ఉధృతి తగ్గడంతో మిర్చి రైతాంగం ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి వరద కారణంగా ఇప్పటికే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 500 ఎకరాల్లో మిర్చి పంట నీటమునిగింది. గోదావరి పెరిగితే మరిన్ని ఎకరాల్లో మునిగి నష్టం వాటిల్లేది. పోలవరం వద్ద కూడా గోదావరి శాంతించింది.



ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

చీటీల పేరిట రూ.రెండున్నర కోట్లకు టోకరా..!

- ఐపీ నోటీసులు పంపడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితులు

నూజివీడు టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):నూజివీడుకు చెందిన సిరిగిరి వెంకటేశ్వరరావు(మోషే) కుల సంఘాన్ని అడ్డు పెట్టుకుని చీటీల పేరుతో తమను మోసం చేశాడంటూ పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారు తెలిపిన వివరాలివి.. బుడగ జంగాల కార్యదర్శిని అంటూ మోషే ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ధర్మాజీగూడెం, బంటుమిల్లి, కుక్కునూరు, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లోని తమ కులస్తులను కలిసి.. మన వారి లాభం కోసమే తాను చిట్‌ఫండ్ నిర్వహిస్తున్నానని చెప్పాడు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని, ఎప్పుడు కావాలంటే అప్పుడు చిట్ పాడుకుని తీసుకోవచ్చని, డివిడెండ్ ఎక్కువ వస్తుందని నమ్మబలికాడు. తన వద్ద చిట్ వేస్తే ఆ సొమ్ము మీ ఇంటిలో వున్నట్టేనని చెప్పుకొచ్చాడు. అతని మాటలు నమ్మి పెద్ద సంఖ్యలో చీటీలు (మిగతా 8వ పేజీలో)



వినతిపత్రాన్ని అందజేస్తున్న పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా నాయకులు

నేడు వైద్యుల చలో విజయవాడ

ఏలూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్ర జ్యోతి): పీహెచ్‌సీల వైద్యుల సమ్మెలో భాగంగా శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన శిబిరం కొనసాగింది. సమ్మె విరమణకు ప్రభుత్వంతో వైద్యుల సంఘం నాయకులు జరిపిన చర్చలు విఫలం కావడంతో శనివారం చలో విజయవాడ, ఆదివారం నుంచి రిలే నిరాహార దీక్షలను చేపట్టాలని నిర్ణయించారు. మరోవైపు సమ్మె ప్రభావం రోగులపై పడకుండా వైద్యసేవలు కొనసాగించేందుకు వీలుగా ఏపీవీవీపీ, ప్రభుత్వ వైద్యకళాశాల నుంచి వైద్యులను తీసుకుని పీహెచ్‌సీల్లో జిల్లా అధికారులు నియమించారు. పీహెచ్‌సీ విధులకు హాజరుకాని వైద్యాధికారులకు మరో అవకాశమిచ్చి, అప్పటికీ విధులకు గైర్హాజరైతే సంబంధిత మెడికల్ ఆఫీసర్ల స్థానే అర్హతలుగల వారిని నియమించాలని డీఎంహెచ్‌వోలకు, కలెక్టరేట్‌లకు ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చేపట్టిన సమ్మెకు బాసటగా నిలవాలని, ఆమేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని (మిగతా 8వ పేజీలో)

వెళ్లి రావమ్మా..దుర్గమ్మ..

ముగిసిన విజయదశమి మహోత్సవాలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. పదకొండు రోజుల పాటు అమ్మవారి ఆలయాలు, పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలు పలు అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం దసరా పండుగ పురస్కరించుకుని రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పలు వేషధారణలు, యువత డ్యాన్స్‌లతో అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. పలు చోట్ల తెప్పోత్సవాలతో దసర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.


మాదేపల్లిలో రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు


ఏలూరు-సత్రంపాడులో సువర్ణ కవచలాంకృత అలంకరణలో అంబికాదేవి అమ్మవారు


దువ్వ గ్రామంలోని వయ్యేరులో దానేశ్వరి అమ్మవారి తెప్పోత్సవం


పాలకొల్లులో శాంతాదేవిగా వాసవీ మాత


తాడేపల్లిగూడెంలో రాజరాజేశ్వరిగా గాయత్రీదేవి


కొయ్యలగూడెం మండలం పొంగుటూరులో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ విగ్రహం


ఏలూరు-పత్తేబాదలో దుర్గమ్మవారి ఊరేగింపులో వేషధారణలు


ఆచంట మండలం పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి తెప్పోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఆకివీడు పెద్దింట్లమ్మ

9న ఏలూరులో జాబ్‌మేళా

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) :ఏలూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని సెట్‌వెల్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి వి.వరలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు తిరుపతి జిల్లా శ్రీసిటీలో గల పశ్చిమ ఆసియాలో అతిపెద్ద కార్బరి చాక్లెట్ తయారీ కంపెనీ ప్రతినిధులు, పలు ఇతర కంపెనీల ప్రతినిధులు హాజరవు తారన్నారు. ఈ కంపెనీలలో టీమ్ మెంబర్ ట్రైనీగా పనిచేయడానికి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా మొదటి ప్రయత్నంలో 50 మార్కులతో ఉత్తీర్ణత సాధించి 18-21 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఏడాదికి రూ.2.34 లక్షలు వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందన్నారు.

16 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరుక్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి):ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో 16మంది తలసేమియా, చికిల్‌సెల్, ఎనీమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్టు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో వారానికి రెండు రోజుల పాటు రక్తమార్పిడి చికిత్సను నిర్వహిస్తున్నామని, అవసరమైన రక్త పరీక్షలతో పాటు మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. శుక్రవారం తలసేమియా చిన్నారులకు సహాయకులు 35 మందికి మధ్యాహ్నం భోజనాన్ని ఏర్పాటు చేసిన దుగ్గిరాల ప్రవీణ్‌కుమార్ దంపతులకు అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆల్బర్ట్, పీఎఆర్ఎస్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, డాక్టర్ ఈ.రేణుశ్రీ, హెడ్‌నర్సు శాంతికుమారి పాల్గొన్నారు.


రాజాధిరాజ వాహనంపై శమీపూజకు వెళ్తున్న శ్రీవారు, అమ్మవార్లు.. జమ్మిచెట్టుకు పూజలు.. ధ్వజస్తంభం వద్ద గరుడ పటానికి హారతిస్తున్న ప్రధాన అర్చకులు

వరుడైన చిన్నతిరుమలేశుడు

- వైభవంగా ఆశ్వీయుజ శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్రంలో ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు జరిగే వైఖానస ఆగమ యుక్తంగా నిర్వహించే ఆశ్వీయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. ముగ్ధమనోహర రూపలావణ్యాలతో సువర్ణ ఆభరణాలు, పట్టువస్త్రాలను ధరించి.. నుదుటున కల్యాణ బాసికాలు, బుగ్గన చుక్కతో విశేష అలంకరణలో అలివేలుమంగ, ఆండాళ్ అమ్మవార్లు కొలువుతీరారు. వీరి నడుమ ఉన్న చిన్నతిరుమలేశుడు పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. ఉభయదేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. ఈ అద్భుత వేడుకను వీక్షించిన భక్తజనులు పరవశించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఈ వేదికపై ఏర్పాటు చేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు హారతులిచ్చి తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేత్రపర్వంగా శమీ పూజ

రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కొలువుదీరిన చిన వెంకన్న విజయదశమి పర్వదినాన రాత్రివేళ శమీపూజ నిమిత్తం నృశింహసాగరం వద్ద వున్న దసరా మండపానికి వెళ్లి పూజలందుకున్నారు. తొలుత ఆలయంలో రాజాధిరాజ వాహనంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. క్షేత్రపురవీధులలో భక్తుల హారతులు అందుకుంటూ నృశింహసాగరం వద్దనున్న మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ అలంకరించిన మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి ముందుగా ఉన్న జమ్మి చెట్టుకు అర్చకులు విశేషపూజలు చేసి హారతులిచ్చారు. అనంతరం భక్తుల నుంచి హారతులందుకుంటూ శ్రీవారు అట్టహాసంగా ఆలయానికి చేరుకున్నారు.

వైభవంగా ధ్వజారోహణం

బ్రహ్మోత్సవ వేడుకలకు సకల చరాచర సృష్టికి ఆహ్వానం పలుకుతూ శుక్రవారం రాత్రి జరిగిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కన్నుల పండువైంది. వైఖానస ఆగమ యుక్తంగా ఇంద్రాది అష్టదిక్పాలకులు, సర్వ దేవతలను, దేవగణాలను, స్వాగతిస్తూ వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు శ్రీవారి ఆలయప్రాకారంలోని ధ్వజస్తంభంపై గరుడపటాన్ని ఎగురవేశారు. ఆ తరువాత మృద్గ్రహణ, అంకురార్పణ, ధ్వజారోహణలు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధిసేవ.. ఉదయం 8-30 నుంచి భజన సంకీర్తనలు.. రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం.

భవానీలతో కళకళ..

విజయదశమి పర్వదినాల నేపథ్యంలో భవానీ దీక్షాదారులు, భక్తులతో చినవెంకన్న క్షేత్రం శుక్రవారం కిటకిటలాడింది. విజయవాడలో దుర్గమ్మను దర్శించిన పలు ప్రాంతాలకు చెందిన వారంతా మార్గమధ్యలో ఉన్న శ్రీవారి క్షేత్రానికి విచ్చేశారు. దాదాపు 12 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



శ్రీ మహా విష్ణువుగా చిన వెంకన్న

శ్రీవారి ఆశ్వీయుజ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు గురువారం శంకు, చక్ర గదా ధారియై ఉభయ దేవేరులతో మహా విష్ణువు అలంకరణలో చినవెంకన్న దర్శనమిచ్చారు. శుక్రవారం చేతిన పిల్లనగ్రోవి, శిరస్సుపై నెమలిపించం ధరించి నీలమేఘశ్యాముడైన మురళీకృష్ణుడి అలంకరణలో భక్తజనులను కటాక్షించారు.

అట్టహాసంగా కుంకుళ్లమ్మ రథోత్సవం

క్షేత్రదేవతగా కొలువుదీరిన కుంకుళ్లమ్మ వారి దివ్య రథోత్సవం గురువారం రాత్రి శ్రీవారి క్షేత్రపురవీధుల్లో అట్టహాసంగా జరిగింది. రాత్రి 11 గంటల వరకు క్షేత్రంలో అమ్మవారి రథయాత్ర సాగింది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని ఈ రథోత్సవాన్ని దేవస్థానం నిర్వహించింది. క్షేత్ర పొలిమేరలో కొలువైన కుంకుళ్లమ్మ ఏడాదికోసారి క్షేత్రానికి రావడం సంప్రదాయం. తొలుత ఆలయం వద్ద రథవాహనాన్ని పుష్పమాలికలు, విద్యుత్‌దీపతోరణాలతో అలంకరించారు. అనంతరం ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తిని వేదమంత్రోచ్ఛరణల నడుమ తీసుకొచ్చి రథంలో ఉంచారు. ఆలయ అధికారులు రథం వద్ద బలిహరణను సమర్పించి రథాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, కాంతార వేషధారణలతో రథయాత్ర క్షేత్రపురవీధులకు పయనమైంది. రథంలో కొలువైన అమ్మవారికి భక్తులు నీరాజనాలు సమర్పించారు.


శ్రీవారి క్షేత్రంలో కుంకుళ్లమ్మ వారి రథ.. రథంలో అమ్మవారు



చికెన్ ధరలు పైపైకి..

వ్యాపారుల సిండికేట్ వల్లే పెంపు

తణుకు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : చికెన్ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. విజయ దశమి పండుగ ముగిసిన సందర్భంగా రానున్న పదిహేను రోజుల పాటు వ్యాపారులు సిండికేట్ వల్ల ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. పది రోజుల నుంచి చికెన్ ధరలు స్వల్పంగా పెరుగుతూ వస్తున్నాయి. గత పది రోజులుగా ధరలు కేజీ రూ.220 నుంచి విక్రయిస్తున్నారు. ఇప్పుడు కేజీ రూ.260 వరకు అమ్ముతున్నారు. వ్యాపారులు ఒక్కొక్కచోట ఒక్కోరంగా ధరలకు అమ్ముతున్నారు. దీనికి కారణం అనుకున్నంతగా వ్యాపారాలు జరగడం లేదని, దానిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంతాలను బట్టి ధరలు ఉంటున్నాయి.

తగ్గిన అమ్మకాలు

సాధారణంగా చికెన్ అమ్మకాలు గతంతో పోల్చితే ప్రస్తుతం తణుకు పరిసర ప్రాంతాల్లో చికెన్ అమ్మకాలు తగ్గినట్టు చెబుతున్నారు. తణుకు పరిసరాల్లో రోజు వారి అమ్మకాలును చూస్తే చికెన్ అమ్మకాలు తగ్గిన విషయం అర్థమవుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

మరింత పెరగనున్న ధరలు..

విజయ దశమి తర్వాత దీపావళి ముందువరకు సుమారు పదిహేను రోజులు పాటు ధరలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎందుకంటే అమ్మవారికి నైవేద్యాలు, మొక్కుల చెల్లింపులు వంటి వాటికి చికెన్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. కేజీ రూ.300 వరకు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. దీపావళి తర్వాత మళ్లీ ధరలు తగ్గే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడుతునానరు. దీపావళి తర్వాత కార్తీక మాసం రావడం వల్ల మాంసం వినియోగం తగ్గడం సాధారణంగా జరుగుతుంది.

సిండికేట్ వల్లే అధిక ధరలు

ఇంటిగ్రేటెడ్ కంపెనీల సిండికేట్ వల్ల ధరల పెరుగుదల, తగ్గుదల నిర్ణయాలు జరుగుతున్నాయి. బ్రాయిలర్ పెంపకం నుంచి చిన్న, సన్నకారు రైతులు నష్టాలు భరించలేక బ్రాయిలర్ రంగం నుంచి ఇతర రంగాలకు వెళ్లిపోయారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు 200 పెంపకం కేంద్రాల వరకు ఉండే పరిస్థితి నుంచి తగ్గుతూ ఇప్పుడు కేవలం పదుల సంఖ్యలో ఉన్నాయి. వారు కూడా కంపెనీల నుంచి పెట్టుబడి తీసుకుని, తిరిగే వారికే విక్రయించేలా చేసుకుంటున్నారు. అందువల్ల కంపెనీల ఆధిపత్యంలోనే ధరలు ఉంటున్నాయి.



మార్కెట్‌ను బట్టి అమ్మకాలు

ప్రస్తుతం మార్కెట్‌లో అమ్మకాలు చాలావరకు తగ్గాయి. రోజువారీ అమ్మకాల్లో సగం వరకు పడిపోయాయి.. కారణాలు తెలియదు. దీంతో వ్యాపారులు ఒక్కోచోట ఒక్కో ధరకు మార్కెట్‌ను బట్టి అమ్ముతున్నారు. పది రోజుల నుంచి పెరుగుతూ వస్తుంది. మరో పదిహేను రోజులు ధరలు పెరిగే అవకాశం ఉంది.

- చిలుకూరి సత్యనారాయణ, మయూరి చికెన్ సెంటర్ నిర్వాహకుడు.

దసరా ఆఫర్ల జోష్..

- ఉమ్మడి పశ్చిమ జిల్లాలో రూ.కోట్లలో వ్యాపారం
- అత్యధికంగా వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు
- పెరిగిన పసిడి అమ్మకాలు

మార్కెట్‌లో అమ్మకాల జోరు

నరసాపురం/ఏలూరు రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దసరా ఆఫర్ల జోరు కనిపించింది. మార్కెట్‌లో ఈ ఏడాది దసరా పండుగ అమ్మకాలు జోరుగా సాగాయి. గత ఐదేళ్లుగా కనిపించని సందడి ఈ ఏడాది అన్ని దుకాణాల వద్ద దర్శనమిచ్చింది. అత్యధికంగా విజయదశమి రోజున కనిపించింది. చాలామంది పోటీ పడి కొనుగోలు చేశారు. సంపన్నులు కంటే మధ్య తరగతి, సామాన్య ప్రజలే ఎక్కువ సంఖ్యలో కొన్నారు. దానికి కారణం జీఎస్టీ తగ్గడం. ఉమ్మడి పశ్చిమ జిల్లావ్యాప్తంగా ఈ పండుగను పురస్కరించుకుని కోట్లాది రూపాయల్లో వ్యాపారం జరిగినట్లు అంచనా.. ఈ సందడి శుక్రవారం కూడా తగ్గలేదు.

జీఎస్టీ తగ్గింపు ప్రభావం..

ఇటీవల కేంద్రం జీఎస్టీని తగ్గిస్తూ ప్రకటన జారీ చేసింది. గత నెల 22 నుంచి ఈ కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. బైక్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు మీద పది శాతం తగ్గడంతో ధరలు భారీగా దిగివచ్చాయి. కంపెనీలు కస్టమర్లను ఆకర్షించేందుకు ఆఫర్లు, లక్కీడ్రాలు, గిఫ్టులు ప్రకటించి, విస్తృత ప్రచారం చేశాయి. పట్టణ, మండలం అన్న తేడా లేకుండా జన సందడి ఎక్కువ ఉండే కూడళ్ల ప్రధాన రహదార్లపై స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలకు దిగారు. వీటిలో అత్యధికంగా టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కంపెనీలు ఉన్నాయి. బైక్‌లు, స్కూటర్లు మీద పది నుంచి రూ.15వేల వరకు ధరలు తగ్గాయి. ఇటు కార్లకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మోడల్ బట్టి రేట్లు దిగాయి. ఈమేరకు ఎక్కువగా పాత వాహనాలను ఎక్ఛేంజ్ చేసుకుని కొత్తవి తీసుకున్నారు. వీటిలో బైక్‌లు, స్కూటర్లు అమ్ముడుపోయాయి. ఇక ఎలక్ట్రానిక్ దుకాణాలు కిటకిటలాడాయి. పండుగ మూడు రోజుల్లో విపరీతమైన అమ్మకాలు చేశారు. అత్యధికంగా ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్‌మిషన్లు వంటి వస్తువులు పెద్ద మొత్తాల్లో అమ్ముడుపోయాయి. జీరో వడ్డీ, జీఎస్టీ తగ్గడంతో కొనుగోలుకు పోటీపడ్డారు. బంగారపుషాపుల్లో అమ్మకాలు పెరిగాయి. అత్యధికంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, నూజివీడు, భీమవరం, టీపీగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం వంటి పట్టణాలతో పాటు మండలాల్లోని షాపుల్లో జోరుగా అమ్మకాలు సాగాయి. చాలా దుకాణాలు రాత్రి 12 గంటల వరకు తెరిచే ఉంచారు. అమ్ముడుపోతున్న వస్తువుల్ని అప్పటికప్పుడు ఆర్డర్లు పెట్టి వ్యాపారులు రప్పించారు. ఈ అమ్మకాలతో వ్యాపారుల్లో జోష్ నెలకొంది.


మోటారు సైకిళ్లు

మార్కెట్‌లో ఆఫర్ల సందడి..

దసరా, దీపావళి వంటి పండుగలకు ఇంట్లోకి కొత్త వస్తువులు కొనుగోలు చేయడం సహజం. దసరాతో పాటు, జీఎస్టీ తగ్గడంతో ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల విక్రయాలు మళ్లీ పట్టాలెక్కాయి. కంపెనీలు పలు ఆఫర్లను అందుబాటులో ఉంచడంతో కొనుగోలుదారులు ఉత్సాహంగా దుకాణాల బాట పట్టారు. వన్‌ప్లస్ వన్ ఆఫర్స్ వంటివి ప్రత్యేక్షమవడంతో దుకాణాలు కిటకిటలాడాయి. దుస్తులు కొనుగోళ్లు దుమ్ము లేపాయి. హోమ్ అప్లయన్సెస్, ఇతర ఎలక్ట్రిక్ గూడ్స్, గాడ్జెట్స్ విస్తృతంగా అమ్ముడు అయ్యాయి. ప్రజలు దసరా ఆఫర్లు మస్తుగా వినియోగించుకున్నారు. నాలుగు రోజుల్లో, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, స్కూటర్లు, టూవీలర్లు, కొత్త బట్టల వ్యాపారం కోట్ల రూపాయల్లో జరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. దీనిక తోడు దసరా పండుగకు ఈకామర్స్ సైటు తెచ్చిన ఆఫర్లను ప్రజలు పెద్దఎత్తున ఉపయోగించుకున్నారు. భారీ డిస్కౌంట్లు నేపథ్యంలో పెద్దఎత్తున అమ్మకాలు జరిగాయి. ఈకామర్స్ సైట్లు పండగ సీజన్‌ను బాగా క్యాష్ చేసుకున్నాయి. ఇందులో భాగంగానే అన్నిరకాల వస్తువులపై భారీ డిస్కౌంట్లను అందించాయి. ఇక ఫ్యాషన్ విభాగంలో సాధారణ రోజులతో పోలిస్తే నాలుగన్నర రెట్లు అధికంగా అమ్మకాలు జరిగాయి.

మావుళ్లమ్మకు నూతన రథం

భీమవరం టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మకు పట్టణానికి చెందని వ్యాపార వేత్త మద్దుల శ్రీరామాచంద్ర మూర్తి కుమారులు నాగ వేంకటదుర్గప్రసాద్, శ్రీనివాస నాగభూషణం రూ.15 లక్షలతో రథం తయారుచేసి విజయదశమి రోజున గురువారం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎమ్మెల్యే పలపర్తి రామాంజనేయలు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రధాన వీధుల మీదుగా రథోత్సవం సాగింది. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధా మహాలక్ష్మీనగేష్ పర్యవేక్షించారు. అనంతరం ఆలయంలో శమీపూజను నిర్వహించారు.


నూతన రథంలో మావుళ్లమ్మ ఉత్సవ మూర్తికి పూజలు చేసిన ఎమ్మెల్యే అంజిబాబు

నిప్పులగుండం తొక్కిన భవానీలు

పెదపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల సందర్భంగా గురువారం పెదపాడు, గుడిపాడు, కొత్తూరు, అప్పనవీడు గ్రామాలతో పాటుగా పలుచోట్ల మాలధారణలు చేసిన భవానీలు అమ్మవార్ల గ్రామోత్సవాలు నిర్వహిం చారు. పెదపాడు తెలగాల పేటలో మాలధారణ చేసిన భవానీలు అమ్మవారికి పూజలు నిర్వహించి నిప్పులగుండం తొక్కి పెద్దసంఖ్యలో కాలినడకన అమ్మవారి దర్శనానికి విజయవాడ బయలుదేరారు. రామచంద్రపురంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచి భవానీలు, మహిళలు తాళ్లతో వాహనాన్ని లాగి గ్రామోత్సవం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం సమీపంలోని కృష్ణా కాలువలో విగ్రహాలను నిమజ్జనాలు నిర్వహించారు.


పెదపాడులో అమ్మవారి వేషధారణలో నిప్పుల గుండం తొక్కుతున్న భవానీ



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హాజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

‘సిట్’ ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

‘సత్యసాయి’ ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిధున్, విశాఖపట్నానికి చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభుత్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్



ఉత్సవంలో మాట్లాడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

స్ఫూర్తి ప్రదాత ‘ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్’

తణుకు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతంలో కర్మాగారాన్ని స్థాపించి అనేకమందికి ఉపాధి కల్పించిన డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. తణుకు ఆంధ్రా షుగర్స్ కాలనీలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఆమె మాట్లాడారు. ప్రస్తుత కాలంలో యువత సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ, వారసత్వ విద్యలను, కళలను పెంచుకోవాలని సూచిం చారు. యోగా, స్కిల్ డెవలెప్‌మెంట్ వంటి కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలన్నారు. కుటుంబ విలువల తగ్గిపోతున్న తరుణంలో సంస్థ ఉద్యోగులు అంతా ఒక కుటుంబంలా వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రా షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య మాట్లాడుతూ షుగర్స్ 500 టన్నుల సామర్థ్యంతో ప్రారంభమై పదివేల టన్నుల సామర్థ్యం వరకు పురోగమించిందన్నారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రవచన రత్నాకర ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ ప్రసంగించారు. సంస్థ ఉద్యోగులు విశ్వనాథకుమార్, సాంబశివరావు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

10న భీమవరంలో ‘పెన్షన్ అదాలత్’



శాంతి ప్రియ

భీమవరంటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):భీమవరంలో ఈనెల 10న నిర్వహించే పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ శుక్రవారం కోరారు. శుక్రవారం భీమవరంలో ఆమె మాట్లాడుతూ ‘పెన్షన్ అదాలత్-ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎట్ యువర్ డిస్ట్రిక్ట్’ అనే కార్యక్రమాన్ని జిల్లాల వారీగా చేపట్టామన్నారు. పెన్షనర్లు, డీడీవోల అభ్యర్థన మేరకు ఈ కార్యక్రమాన్ని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. దీని కారణంగా పదవీ విరమణ తేదీకి ముందే పెన్షనర్ ప్రయోజనాలను పొందేలా చేస్తుందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఎంపీ మహేశ్

ఏలూరుటూటౌన్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): పెట్రోలియం, సహజ వాయువుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ నియమితులయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా నియమించారు. కేంద్ర ప్రభుత్వంలోని పలు కమిటీల్లో ప్రాధాన్యత ఇస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు రెవెన్యూ క్రీడల ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ క్రీడల సందర్భంగా ఈనెల ఐదో తేదీన ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు జిల్లాలో ఉన్న రెవెన్యూ ఉద్యోగులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఈ క్రీడల కోసం ప్రభుత్వం ఐదు రోజుల పాటు ప్రత్యేక సెలవులు ప్రకటించిందని తెలిపారు. వాకింగ్ రేస్, క్యారమ్స్‌డబుల్స్, టెన్నికాయిట్, వంద మీటర్లు డాష్, షాట్‌పుట్, 4x100 రిలే, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, త్రోబాల్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, మ్యూజికల్ ఛైర్స్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు.

మట్టుబెట్టి.. మూటగట్టి గోదావరిలో పడేశారు

- కొలిక్కి వచ్చిన యువకుడి మిస్సింగ్ కేసు.. సఖినేటిపల్లి వద్ద గోదావరిలో మృతదేహం లభ్యం

తణుకు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడేనికి చెందిన మడుగుల సురేశ్(25) అదృశ్యం కేసు మిస్టరీ విడింది. అతన్ని మట్టుబెట్టి.. మూటగట్టి గోదావరిలో పాడేయడంతో మృతదేహం కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో లభ్యమైంది. అదృశ్యం కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. తణుకుకు చెందిన ఓ మహిళతో వున్న వివాహేతర సంబంధం కారణంగా అతన్ని హత్య చేసి గోనె సంచిలో మూట కట్టి రహస్య ప్రదేశంలో పడేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. పట్టణానికి చెందిన ఓ న్యాయవాదితోపాటు మరో నలుగురి పాత్రపై అనుమానంతో పోలీసులు విచారణ జరిపి వారిని అదుపులోకి తీసుకోవడంతో అసలు విషయాలు బయటపడ్డాయి. సురేశ్ గత నెల 23న తణుకులో అదృశ్యమయ్యాడు. న్యాయవాది భార్యతో వివాహేతర సంబంధం నేపథ్యంలోనే సురేశ్ అదృశ్యం అయ్యాడనే అనుమానంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు న్యాయవాది భార్య సైతం తన భర్తపై అనుమానం ఉందని అంగీకరించడంతో సురేశ్ కుటుంబసభ్యులు కోర్టు ఆవరణలోనే న్యాయవాదిని నిలదీశారు. అప్పటి నుంచి అతనితోపాటు.. అతనితో సన్నిహితంగా ఉంటున్న నలుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపారు. వీరిలో ఇద్దరిని అదులోకి తీసుకుని విచారించగా సురేశ్‌ను హత్య చేసి చించినాడ వద్ద గోదావరిలో వేసినట్టు ఒప్పుకున్నట్టు తెలిసింది. ఈ సమాచారం మేరకు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా గురువారం సఖినేటిపల్లి వద్ద సురేశ్ మృతదేహం గోనె సంచి మూటలో లభ్యమైంది. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా కుళ్లిపోవడంతో కుడి చేతిపై పచ్చబొట్టు, దుస్తుల ఆధారంగా నిర్ధారణ చేసుకుని రాజోలు ఆసుపత్రిలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కేసులో న్యాయవాది, అతని సోదరుడి కారు నెంబరు ప్లేటు మార్చి వినియోగించినట్టు తెలిసింది. ఇప్పటికే అదుపులో వున్న నిందితులతోపాటు మరికొందరి ప్రమేయం ఉందని తేలడంతో ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. ఒకటి రెండు రోజుల్లో పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.



సురేశ్(ఫైల్)

అత్యాచారం కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఏలూరుక్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడినట్టు ఒక యువకుడిపై నేరం రుజువు కావడంతో అతడికి పది ఏళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ ఏలూరు ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం టి.నర్సాపురం మండలంలోని ఒక గ్రామానికి చెందిన మూగ, చెముడు కలిగిన ఒక వివాహితపై 2018 మార్చి 21 మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉండగా టి.నర్సాపురం మండలం కె.జగ్గవరం గ్రామానికి చెందిన కుమ్మరి రమేశ్(35) అనే యువకుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు.ఆ తరువాత పరారయ్యాడు. ఈ సంఘటనపై టి.నర్సాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేయగా కేసు దర్యాప్తు చేసి నిందితుడు రమేశ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ళ జైలు శిక్ష, 500 రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున చింతమనేని రమేష్ వాదించగా, ప్రాసిక్యూషన్‌కు పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, టి.నర్సాపురం ఎస్ఐ జయబాబు, జీలుగుమిల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కోర్టు మానిటరింగ్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్ఎన్ మూర్తి, ఏఎస్ఐలు సిసిలి, రుక్మందనరావు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ జయరాజు సహకరించారు.

చోరీ కేసులో పేర్లు చెప్పాడని యువకుడి దారుణ హత్య



రాజేశ్(ఫైల్)

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెంలో పట్టపగలు దారుణ హత్య జరిగింది. పట్టణ శివారులోని బైనేరు వంతెన సమీపంలో కర్రి రాజేశ్(27)అనే పాత నేరస్థుడిని మరో కొంతమంది పాత నేరస్తులు వెంటాడి పట్టుకుని కాళ్లు, చేతులు కట్టేసి కత్తితో విచక్షణా రహితంగా నరికి చంపిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. స్థానిక బైనేరు వద్ద వ్యక్తి మృతదేహం ఉందనే సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పట్టణానికి చెందిన కర్రి రాజేశ్ వృత్తి రీత్యా టాటూ వేస్తుంటాడు. కొంత కాలంగా చోరీలకు అలవాటుపడ్డాడు. స్థానికంగా ఉన్న పలువురు దొంగలతో రాజేశ్‌కు పరిచయం ఏర్పడింది. వీరంతా పలు చోరీ కేసుల్లో నిందితులు. కొద్ది రోజుల క్రితం రాజేశ్ తెలంగాణలోని ఓ కేసులో పట్టణానికి చెందిన పలువురి పేర్లు అక్కడి పోలీసులకు వెల్లడించాడు. దీంతో వారంతా రాజేశ్‌పై కక్ష పెంచుకుని శుక్రవారం హత్యకు ప్లాన్ చేశారు. రాజేశ్ కోసం శుక్రవారం పట్టణానికి చెందిన ఖాశీం, చోటు అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారని వారిని చూసి తన భర్త గోడ దూకి పారిపోయాడని భార్య నాగేశ్వరి తెలిపింది. అయితే తన భర్త ఇలా శాశ్వతంగా దూరమైపోతాడని కలలో కూడా ఊహించలేదని నాగేశ్వరి కన్నీటి పర్యంతమైంది. ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. హత్యకు కారణమైన వారిని గాలిస్తున్నామని, మరిన్ని వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తానని డీఎస్పీ తెలిపారు. మృతుడు రాజేశ్‌కు భార్య, తల్లి, సోదరుడు ఉన్నారు.

పోలవరం కుడి కాలువలో

వృద్ధురాలి మృతదేహం లభ్యం

పెదవేగి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం ముండూరు సమీపంలో పోలవరం కుడికాలువలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం బయటపడింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నీలంరంగు జాకెట్, పచ్చరంగు చీర ధరించి ఉన్న ఆమె వయస్సు సుమారు 70 ఏళ్ల ఉంటుందని, ఆమె ఎవ్వరనే విషయం తెలియరాలేదని ఎస్ఐ చెప్పారు. వివరాలు తెలిసినవారు 94407 96638 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఏలూరు పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు.ఏలూరు రూరల్ మండలం లింగారావు గూడానికి చెందిన నూలి ఈశ్వరరావు అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు దాడి చేసి అతడిని అరెస్టు చేసి మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

బాలుడిపై కుక్క దాడి



జీలుగుమిల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):కుక్క కాటుకు బాలుడు ఆస్పత్రి పాలైన ఘటన జీలుగుమిల్లి శివారు రామన్నపాలెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గెడ్డం జనార్దన్ నాలుగేళ్ల కుమారుడు నిహాన్ దసరా రోజు తోటి వారితో వీధిలో ఆటలాడుతున్న సమయంలో కుక్కల గుంపు మీదకు వచ్చింది. కొందరు చిన్నారులు పరుగులు పెట్టారు. అందులో ఒక కుక్క బాలుడి నిహాన్‌పై దాడి చేసి తలపై పొట్టమీద వీపుపై కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి బాలుడిని తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న బాలుడి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆస్పత్రి వైద్య సిబ్బందితో మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జి.రవికుమార్, పి.రాము ఉన్నారు.




సదస్సులో పాల్గొన్న జిల్లా జడ్జి శ్రీదేవి, అధికారులు

సత్ప్రవర్తనతో జీవనం సాగించండి

ఖైదీలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి హితవు

ఏలూరు క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఖైదీలు జైలులో ఉన్న సమయాన్ని శిక్షగా భావించకుండా సత్ప్రవర్తనతో నూతన జీవితం ప్రారంభించాలన్నారు. జాతిపిత గాంధీ ఆశయాలు అలవరుచుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఇస్తున్నామని, బెయిల్ వచ్చి ష్యూరిటీ మొత్తం కట్టలేని రిమాండ్ ఖైదీలకు ప్రభుత్వమే ఆ సొమ్ము కట్టి విడుదల చేయిస్తోందన్నారు. జైలు సూపరిం టెండెంట్ సీహెచ్‌ఆర్‌వి స్వామి నివేదికను సమర్పించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఆర్వో వి. విశ్వేశ్వరరావు, జైల్ అనధికార ప్రతినిధులు లేళ్ళ వెంకటేశ్వర రావు, డాక్టర్ అబ్బూరి అరుణ, వైద్యులు డాక్టర్ స్వరూప్, న్యాయ వాదులు మునేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. జైలర్లు వి. రమేష్, కె. శ్రీనివాసరావు, కె. వీర వసంతరావు, సూపరింటెండెంట్ స్వామి పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం ఆవిష్కరిస్తున్న దృశ్యం

సమరయోధుల పార్కులో గాంధీ విగ్రహం

స్ఫూర్తిగా నిలుస్తుందన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో ప్రతిష్ఠించిన గాంధీజీ విగ్రహం తణుకు ప్రాంత ప్రజలకు, భావితరాలకు నిరంతర స్ఫూర్తిగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహావిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ పార్కును జాతీయోద్యమ సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తామన్నారు. విగ్రహ దాతలైన స్వాతంత్ర్య సమరయోధుడు సంకు అప్పారావు కుమార్తె సంకు మనోరమ, డీవీవీఎస్ వర్మ దంపతులను సత్కరించారు. మనోరమ మాట్లాడుతూ నేటి దేశ పరిస్థితుల్లో గాంధీజీ భావజాలమే పరిష్కారమన్నారు. డీవీవీయస్ వర్మ మాట్లాడుతూ సత్యం, అహింసల అజేయ మార్గాన్ని ప్రపంచానికి అందించిన యోధుడు గాంధీజీ అని ఆదారిలో అంతా నడవాలని కోరారు. కార్యక్రమానికి సహకారం అందించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి, మున్సిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్, సమన్వయకర్త బుచ్చిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ తాతిన రామబ్రహ్మం, డాక్టర్ వత్సవాయి వెంకటరాజు, డాక్టర్ చెలికాని స్టాలిన్, యర్రమిల్లి విజయలక్ష్మి, చల్లా హైమవతి, భూపతిరాజు రమేష్‌చంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆరిమిల్లి తహసీల్దార్ కార్యాలయం, రాష్ట్రపతిరోడ్డులోని గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆగ్రహంతో అదుపుతప్పిన శ్రీనివాసుని ఏనుగు

ద్వారకాతిరుమల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ గజలక్ష్మి(ఏనుగు) గురువారం రాత్రి తిరు వీధిసేవ సమయంలో కాస్త ఆగ్రహంతో ఆందోళనకు గురి చేసింది. గజలక్ష్మి ఆగ్రహం ప్రదర్శించడంతో భక్తులు, గ్రామస్థులు భయాందోళనలతో పరుగులు తీశారు. కాసేపటికి తేరుకున్న మావటిలు గజలక్ష్మిని అదులోకి తీసుకొచ్చారు. ఊరేగింపు సమయంలో బానే ఉన్న గజలక్ష్మి ఒక్కసారిగా విచిత్రంగా ప్రవర్తించింది. మావటిలు చాకచక్యంగా వ్యవహరించడంతో ఆలయ అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించిన బూసి వినీత

ఏలూరు క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. ఆ సెంటర్‌కు ఎక్కువగా ఏ విధమైన కేసులు నమోదు అవుతున్నాయి అక్కడ ఉన్న ఆ సెంటర్ పరిపాలనాధికారిని చుక్కా నిర్మలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్ బాధిత మహిళలకు ఒక ఆశాకిరణమన్నారు. ఈ సెంటర్‌లో అందిస్తున్న కౌన్సెలింగ్ సేవలు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె తీవ్రతరం : డిస్కం జేఏసీ

ఏలూరుటూటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె తీవ్రతరం చేస్తున్నట్టు డిస్కం జేఏసీ నేతలు భూక్యా నాగేశ్వరరావు నాయక్, తురగా రామకృష్ణలు తెలిపారు. విద్యుత్ కార్యాలయంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని ఉద్యోగులంతా సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 6న విశాఖపట్నంలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో 8న తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో, 13న ఛలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఎం.రమేశ్, ఎస్.నరసింహారావు, శ్రీనివాస్, కే.కృష్ణకుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోగుల పట్ల మర్యాదగా ఉండాలి: డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని ల్యాబ్ టెక్నీషియన్లకు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం సూచించారు. శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీల ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ రక్త, మూత్ర పరీక్షల సంఖ్యను పెంచాలని, శాంపిల్స్ సేకరణ గదులను, పరికరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ల్యాబ్ పరీక్షల రిపోర్టులు ఖచ్చితత్వంతో ఇచ్చినప్పుడే రోగులు ధైర్యంగా ఉండగలుగుతారని పేర్కొన్నారు. డెంగీ పరీక్షలు, మలేరియా కేసుల తగ్గుముఖంపై సూచనలు చేశారు. కొత్తగా ఓపీ విభాగానికి వచ్చే రోగుల్లో 15శాతం మందికి రక్తపరీక్షలు చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధి బాధ్యత ధర్మకర్తలదే : ఎమ్మెల్యే చంటి


ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్/కార్పొరేషన్ అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్ పేటలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చెయ్యాల్సిన బాధ్యత ధర్మకర్తల మండలిపై ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ధర్మకర్తల మండలి నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్ పర్సన్‌గా పాలడుగు వెంకట రమాదేవి, ఇతర ధర్మకర్తలతో ఎమ్మెల్యే చంటి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ధర్మకర్తల మండలిలో చోటు దొరకడం అదృష్టమని వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో భక్తులకు సేవ చేయాలన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం నూతన చైర్మన్ రమాదేవి, రాజేంద్ర ప్రసాద్ దంపతులను ఎమ్మెల్యే చంటి, మీనా దంపతులు సన్మానించారు.

ఘనంగా అమ్మవార్ల ఆలయ 6వ వార్షికోత్సవం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): బావిశెట్టివారిపేటలోని నాగేశ్వరపురం చెరువుగట్టు వద్ద ఉన్న గణేశ్ కార్తికేయ గంగానమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయం ఆరవ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు అభిషేకాలు, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవార్లకు ఊయల సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని నివేదనలు సమర్పించి భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించడంతో ఆ ప్రాంతమంతా భక్త జనంతో కిటకిటలాడింది. ఆలయ ఇన్‌చార్జి నౌడగాని శ్రీనివాసరావు, పూర్ణ మిత్ర బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేయగా ఆలయ అర్చకులు బాపట్ల శర్మ భక్త బృందంతో పూజలు చేయించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

పెదవేగి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రామసింగవరం ఎంపీటీసీ సభ్యుడు గుర్రం మాధవ్ అధ్యక్షతన శుక్రవారం సాదాసీదాగా జరిగింది. వైసీపీకి చెందిన ఎంపీపీ తాతా రమ్య సహా ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులంతా గైర్హాజరయ్యారు. టీడీపీ ఎంపీటీసీ సభ్యులతో కోరం పూర్తికావడంతో రామశింగవరం ఎంపీటీసీ సభ్యుడు గుర్రం మాధవ్ అధ్యక్షతన ఎంపీడీవో రవి కుమార్ సమావేశాన్ని నడిపించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో పథకంలో పెదవేగి మండలంలో 675మంది ఆటో డ్రైవర్లు నమోదు చేసుకోగా, 171మందికి మినహా మిగిలిన వారందరికీ రూ.15వేలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. 171మంది దరఖాస్తులు మరోసారి పరిశీలిస్తామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకంలో 11,851మందికి రూ.5.28కోట్లను పంపిణీ చేశామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధిని అందజేస్తామని తెలిపారు.

శింగగూడెంలో 8,9 తేదీల్లో ఆటల పోటీలు

లింగపాలెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో మండల స్థాయి అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు లింగపాలెం మండల కో ఆర్డినేటర్ సి.హెచ్.ప్రకాశ్ రెడ్డి తెలిపారు. మండలంలోని శింగగూడెం జడ్పీ హెచ్‌స్కూల్లో ఖోఖో, చెస్, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్‌కు సంబంధించిన విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీలకు అండర్14కు 2012 జనవరి 1 తరువాత, అండర్ 17కు 2009 జనవరి 1 తరువాత పుట్టిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు.

కారును ఢీకొట్టిన బుసకతో వెళ్తున్న లారీ

ఏలూరుక్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కైకలూరు నుంచి ఏలూరు శనివారపుపేటనకు బుసకను తీసుకెళ్తున్న లారీ శుక్రవారం 12 గంటల ప్రాంతంలో ఒక కారును ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయిపోయింది. గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వివిధ ప్రాంతాలకు బందోబస్తులకు వెళ్లడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేయడానికి ఎవ్వరు లేకపోవడంతో ఒక ఏఎస్‌ఐ, హోంగార్డు, మఫ్టీలో ఉన్న ముగ్గురు కానిస్టేబుళ్లు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆ ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీని, నుజ్జునుజ్జు అయిన కారును పోలీసులు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సాధించారు

(5వ పేజీ తరువాయి)

భాస్కరరావు, కొడవ కంటి సునీత, జంగారెడ్డిగూడెంలో దోసూరి మంగమ్మ, చింతలపూడిలో ఎస్.వరకుమార్.

- ఉత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడరులుగా చేబ్రోలుకు చెందిన ఎల్.ప్రసాదరావు, సింగగూడెంకు చెందిన శీకాకాలు పుల్లయ్య, వేదాంతపురానికి చెందిన జొన్నకూటి ఏసు, పోతురెడ్డి పల్లికి చెందిన రెడ్డి కొడనాల రామయ్య అవార్డులను సాధించారని కలెక్టర్ వివరించారు.

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈనెల 6న జరిగే రాష్ట్రస్థాయి అవార్డులు ప్రదానం జరుగుతుందని, అదే రోజు ఏలూరులో స్వచ్ఛాంధ్ర అవార్డులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో అందించి సత్కరిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీహరి పాల్గొన్నారు.

చీటీల పేరిట రూ.రెండున్నర కోట్లకు టోకరా..!

(5వ పేజీ తరువాయి)

కట్టారు. చీటీ పాడుకున్న ప్పటికి డబ్బులు ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి అతన్ని నిలదీస్తే వాయిదాలు వేస్తున్నాడు. చివరకు తన వద్ద డబ్బులు లేవంటూ ఐపీ నోటీసులు పంపుతున్నాడని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తమకు సుమారు రెండున్నర కోట్ల వరకు చెల్లించాల్సి వుందని ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిన్నకల్లుకు చెందిన గోపిరాజు, నూజివీడుకు చెందిన బి.దావీదు నేతృత్వంలో 52 మంది ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సత్యశ్రీనివాస్ తెలిపారు.

నేడు వైద్యుల చలో విజయవాడ

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థిస్తూ ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడిజిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, సెక్రటరీ ఎస్.రామారావు, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్‌లకు వైద్యుల సంఘం జిల్లా నాయకులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ జోషిమా, డాక్టర్ బాలు, డాక్టర్ రాజీవ్, డాక్టర్ రోహిత్, తదితరులు శుక్రవారం ఏలూరులో వినతిపత్రాన్ని అందజేశారు. కాగా ఏలూరులో నిర్వహించిన నిరసన శిబిరంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్, పీహెచ్‌సీల్లో పనిచేసే సుమారు 70 మంది మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ముగిసిన దసరా వేడుకలు


ఏలూరు నగరంలో అమ్మవారి ఊరేగింపు దృశ్యం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో గత నెల 22వ నుంచి పలు డివిజన్లలోని అమ్మవారి ఆలయాల వద్ద, వివిధ కూడళ్లలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి భక్త జనానికి దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు దసరా ఉత్సవాలు ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని మహా అన్న ప్రసాద వితరణను ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమాలను పయిడేటి రఘు, సత్యవాడ దుర్గా ప్రసాద్ మిత్రబృందం తగు సేవలు అందించారు.

● బుట్టాయగూడెం: మండలంలో నిర్వహించిన దసరా ఉత్సవాలు ముగిశాయి. ముగింపు సందర్భంగా పలుచోట్ల కమిటీవారు అన్న సమారాధనలు జరిపించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. రెడ్డిగణపవరం శ్రీవిశ్వేశ్వర కనక దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన లడ్డూను వేలం పాట నిర్వహించగా ఇదే గ్రామానికి చెందిన భక్తుడు దుర్గే విష్ణు రూ.10 వేలకు దక్కించుకున్నాడు. కమిటీ సభ్యులు అల్లూరి రత్నాజీరావు, భౌమరాజు ధనుంజయ రాజు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: విజయ దశమి సందర్భంగా జగదాంబ అమ్మవారిని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇటీవల ఎన్‌హెచ్ రోడ్డు విస్తరణలో జగదాంబ ఆలయం ఉండటంతో పున నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.44 లక్షల నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లించిందన్నారు. సుమారు కోటి రూపాయలతో ఆలయం నిర్మాణం జాతీయ రహదారికి సమీపంలోనే నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, శివాలయం, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసేలా చూస్తామన్నారు. ఎల్లమ్మ గుడి వద్ద భవానీలు ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు, మండల నాయకులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, కూసంపూడి త్రిమూర్తిరాజు ఉన్నారు.

● టి.నర్సాపురం: టి.నర్సాపురంలో దేవీనవరాత్రుల్లో భాగంగా కనకదుర్గమ్మను అంగరంగ వైభవంగా పుర వీధుల్లో శుక్రవారం ఊరేగించారు. విజయదశమి గురువారం రాత్రి కనకదుర్గమ్మ ఆలయం వద్ద శమీపూజ అనంతరం మూలమంత్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు కార్యాక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మారంపల్లిలో దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

● ద్వారకాతిరుమల: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మారంపల్లిలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం పాల్గొన్నారు. ముందుగా ఆయన ఏఎంసీ చైర్మన్ బ్రహ్మారాజు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, మొగతడకల ఓం ప్రకాష్ చౌదరి, పాతూరి సహృదయ్, ఏపూరికిషోర్ తదితరులతో కలిసి కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం పలువురికి అన్నదాన వితరణ జరిపారు.ఆ తరువాత తిమ్మాపురంలోని తోట గంగాధర్ భవానీ పీఠాన్ని దర్శించుకున్నారు.

● కామవరపుకోట: స్థానిక శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో జరుగుతున్న దేవీనవరాత్రులు ముగింపు సందర్భంగా గురువారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ రాజరాజేశ్వరి అలంకరణలోని లలితాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించగా ఎమ్మెల్యేను పూర్ణకుంభంతో ఆహ్వానించి పూజల అనంతరం మెమెంటోను అందజేశారు.

ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజ


ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ కిశోర్, ధాత్రిరెడ్డి దంపతులు

ఏలూరు క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ దసరా పండుగను పురాణ కాలం నుంచి జరుపుకుంటున్నామని ఎస్పీ కెపిఎస్ కిశోర్ అన్నారు. విజయ దశమి పండుగను పురస్కరించుకుని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధపూజ, వాహన పూజలను ఎస్పీ కిశోర్ ఆయన సతీమణి ఐఎస్‌ఐ అధికారిణి ధాత్రిరెడ్డిలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఆనందోత్సాహాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.సంపద, పాడిపంటలు సమృద్ధిగా పండి జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వరాలతో వర్ధిల్లాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యాన్ని పోలీస్ సిబ్బంది కొనసాగించాలని, పౌరుల భద్రత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

● జాతిపిత మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిలను పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో వారి చిత్రపటాలకు ఎస్పీ కిశోర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి నివాళి


భీమడోలులో నివాళులర్పిస్తున్న గన్ని, తదితరులు

భీమడోలు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండల వ్యాప్తంగా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. భీమడోలు గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఏఎంసీ చైర్మన్ శేషగిరి, కరణం పెద్దిరాజు, పుల్లయ్య నాయుడు, కుక్కల ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే దసరా ముగింపు ఉత్సవాల్లో భాగంగా భీమడోలు జంక్షన్‌లో వేంచేసిన శ్రీ కనకదుర్గమ్మను నాయకులు దర్శించుకుని పూజలు చేశారు.

● పెదవేగి: దేశాన్ని దోచుకున్న బ్రిటీష్ పాలకులను మించి వైసీపీ నాయకులు దోపిడీకి పాల్పడ్డారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం జాతిపిత గాంధీజీ జయంతిని పురస్కరించుకుని దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాత్ముడి విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనాడు విదేశీయులైన తరిమికొట్టినట్టు రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు అందినకాడికి దోచుకున్న వైసీపీ ముష్కరులను అలాగే తరిమికొట్టాలన్నారు.

ఆఫ్రికా నత్తలు వస్తున్నాయి జాగ్రత్త

చింతలపూడి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా నత్తలు ఉద్యానవన పంటలపై దాడి చేయడానికి వస్తున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాఖాధికారిణి ఎం.డి.షాఫియాపర్వీన్ తెలిపారు. ముఖ్యంగా బొప్పాయి, అరటి, జామ, కూరగాయలు, వక్క, కోకో, పామాయిల్ తోటలకు వ్యాపించి తీవ్రనష్టం కలిగిస్తాయన్నారు. ఈ ఆఫ్రికా నత్తలు నెలకి 100 నుంచి 400 గుడ్లు పెడతాయని, వీటి నివారణకు తోటలను శుభ్రంగా ఉంచుకోవాలని, నత్తలను గుర్తిస్తే రైతులు చేతికి గ్లౌజులు ధరించి ఎప్పటికప్పుడు ఏరి ఉప్పునీటి ద్రావణంలో కలపాలన్నారు. సత్వర నివారణకు చీలేటెడ్ కాపర్ మూడు గ్రాములు, ఫెర్రోమేగ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే రెండు నిమిషాల్లో కిందపడి 95 శాతం వరకు చనిపోతాయన్నారు. కింద పడిన నత్తలను సేకరించి నాలుగు లీటర్ల నీటిలో ఐదు కేజీల ఉప్పును వేసి ఆ ద్రావణంలో వేయాలన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం: ఎంపీ

ఏలూరుటూటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):ఉచిత బస్సు పథకంతో ఇబ్బంది పడుతున్న ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ఆటో డ్రైవర్ల సేవలో అనే పథకాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎంపీ మహేశ్ అన్నారు. ఈ పథకంలో డ్రైవర్లకు రూ.15వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. దీపావళి నాటికి ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాల్లో సంతోషం నింపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అక్టోబర్ 4 నుంచి పథకం ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల మంది ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. జిల్లా నుంచి 10,655 మంది లబ్ధి పొందుతున్నారని అన్నారు.


కుక్కునూరులో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


లింగపాలెంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

అవగాహన కార్యక్రమాలపై దిశానిర్దేశం

ఏలూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీలో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణల ఫలాలు అన్ని వర్గాలకు వివరించే ప్రయత్నంగా సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ, వర్తకులు, వినియోగదారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఆమె ఈ వారంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై టెలికాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 4వ తేదీన ఆటోడ్రైవర్ సేవలో కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బి నాగార్జునరావులు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. విజయ దశమిని పురస్కరించుకుని పలు వాణిజ్య షాపులను ఎమ్మెల్యే చంటి సందర్శించి కొనుగోలుదారులకు జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఇడా చైర్మన్ శివ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, శ్రీకృష్ణగ్రూప్స్ అధినేత నారా శేషు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: తగ్గిన జీఎస్టీ ధరల ప్రకారమే వ్యాపార లావాదేవీలు జరగాలని జంగారెడ్డిగూడెం డివిజన్ ఏసీటీవో విల్సన్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసరాల నుంచి భారీ వాహనాల వరకూ అన్నింటిపై జీఎస్టీ తగ్గించిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో పీవీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై రెవెన్యూ, కిరాణా, ఫాన్సీ దుకాణదారుల్లో సమావేశమయ్యారు. ఏఏ వస్తువులపై దేశ వ్యాప్తంగా జీఎస్టీ అమలులో ఉందనే అంశాన్ని తెలియజేశారు. జడ్పీటీసీ శామ్యూల్ పాల్గొన్నారు.

● కుక్కునూరు: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌కు సంబంధించిన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వ్యవసాయ శాఖ, ప్రభుత్వం ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాష మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు అనేది రైతుకు చేయూత, దేశానికి ప్రగతిబాట అన్నారు. ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ 12 నుంచి 5శాతం తగ్గించి రైతు జీవన ప్రమాణాలు మెరుగు, ఆదాయం రెట్టింపుకు దోహద పడుతుందన్నారు.టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పిచ్చుకరాజు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, బీజేపీ కోశాధికారి లక్ష్మణాచార్యులు, వ్యవసాయ సంచాలకులు బుజ్జిబాబు, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో నరసింహరావు, ఏవో బాలాజీ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: వ్యవసాయ యాంత్రీకరణలో ఎరువులపై జీఎస్టీ తగ్గడం రైతులకు ఎంతో లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.కె.హబీబ్ బాషా అన్నారు. శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు మాట్లాడారు. ఆర్డీవో ఎం.ముక్కంటి, ఏడీఏ బుజ్జిబాబు, మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు సంబూరి రామచంద్రరాజు పాల్గొన్నారు.

● లింగపాలెం: పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు జీఎస్టీ సంస్కరణలు ఎంతో మేలు చేస్తాయని డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి అన్నారు. మండల కేంద్రమైన లింగపాలెంలో డిప్యూటీ ఎంపీడీవో ఏ సుందరి, మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్‌ల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్‌లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ధర్మ పరిరక్షణకు హిందువులు ఏకం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాబా శివ

ఏలూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు హిందువులు ఏకం కావాలని సనాతన హిందూ ధర్మ సహ ప్రచార అధ్యక్షులు బాబా శివ అఘోరి పిలుపునిచ్చారు.ఏలూరులో గురువారం విజయదశమి సందర్భంగా ఓ హిందూ మేలుకో పేరిట అన్ని వర్గాల సమక్షంలో ఆయన ఓ కార్యక్రమం ఆరంభించారు. సనాతన హిందూ ధర్మం, హిందువుల జాగృతి కోసం ప్రతీ ఒక్కరూ నడుంబి గించాలన్నారు. హిందూ ఆలయాలపై, హిందువుల దాడులు జరుగుతున్న కొందరు మౌనం దాల్చడం సరికాదని స్వదేశీ జాగరణ్ మంచ్ అధ్యక్షులు రామ నపూడి శివ ప్రసాద్ కోరారు. జీఎస్‌వీ సత్యనారాయణ, జంగా లక్ష్మణరావు, వానపల్లి జాన్సీ కుమారి పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై అవగాహన

దెందులూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు లేకుండా చేయడానికి చేయడానికి చేపట్టిన రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు) అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం, వేగవరం గ్రామాల్లో మండల సర్వేయర్ వై.వెంకట రమణ, భూ రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, ఆధ్వర్యంలో గ్రామస్థులకు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి స్టానిష్ బాబు పాల్గొన్నారు.

రైతులు రీసర్వేను వినియోగించుకోండి..

టి.నర్సాపురం: రైతులు రిసర్వేను వినియోగించుకోవాలని తహసీల్దార్ సాయిబాబా శుక్రవారం తెలిపారు. రిసర్వే బొర్రంపాలెం, తెడ్లం, శ్రీరామవరం గ్రామాల్లో నిర్వహించనున్నామని, 3వ తేదీ నుంచి రిసర్వే ఫీల్డ్‌వర్క్ గ్రౌండ్ ట్రూటింగ్ వర్క్ మొదలవుతుందన్నారు. నోటీసు, వాట్సాప్ మెసేజ్, ఫోన్ కాల్ ద్వారా తెలియజేసినప్పుడు ఆధార్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, దస్తావేజుల జిరాక్సుతో వచ్చి సర్వే చేయించుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదపాడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం, పెదపాడు సెక్షన్ పరిధిలోని వట్లూరు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం 4వ తేదీ అనగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. వట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని వట్లూరు, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుడివాకలంక ప్రాంతాలకు...

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం, చాటపర్రు సెక్షన్ పరిధిలోని 33 కేవీ గుడివాకలంక ప్రాంతాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అంబేడ్కర్ తెలిపారు.

2030 నాటికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధికి 2030 నాటికి అవసరమయ్యే యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఐటీడీఏ డీవైఈవో రవికుమార్ సూచించారు. మండలంలోని పిడకప్పగూడెం గిరిజన గ్రామంలో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంపై పట్టెన్నపాలెం సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ నెల 12న పడకప్పగూడెంలో గ్రామ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. హౌసింగ్ ఈఈ ప్రసాద్, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, జిల్లా మాస్టర్ ట్రైనర్ నాగ పొన్నారి పాల్గొన్నారు.

నాయక్‌ల ఆందోళన విరమణ

కామవరపుకోట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గత పది రోజులుగా నాయక్ కులస్థులకు గతంలో వలే ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ దశల వారీగా ఆందోళన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.ఈ శిబిరాన్ని గురువారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ సందర్శించి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. నాయక్‌లకు ఎస్టీ సర్టిఫికెట్లు అందచేసేలా చర్యలు తీసుకుంటానని, ఇప్పటికే అసెంబ్లీలో ఈ విషయంపై ప్రస్తావించానని హామీ ఇవ్వడంతో నాయక్ సంఘ నాయకులు ఆందోళనను విరమించారు.



శ్రీవారి సేవలో చింతమనేని

ద్వారకాతిరుమల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చినవెంకన్నను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సందర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించిన అనంతరం స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని అందజేశారు. అనంతరం డిప్యూటీ ఈవో బ్రహ్మాజీ, ఏఈవో నటరాజారావు, ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.

దాతలు ముందుకు రావాలి

ఏలూరుటూటౌన్, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేసేందుకు స్వచ్ఛందగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిరు వ్యాపారులకు తోపుడుబళ్లు, విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు, వినికిడి మిషన్లు, ల్యాప్ టాప్‌లు అందజేశారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే పథకాలు అందిపుచ్చుకోవాలన్నారు. మాలల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా నాగరాజకుమారి

ఏలూరు రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా గారపాటి నాగరాజుకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం టి. నరసాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో భీమనేని దయాసాగర్ పదవీ విరమణ చేశారు. నూతన ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తానన్నారు. సూపరింటెండెంట్ సత్యనారాయణ, కడెమ్మ, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు.

నిత్య భిక్ష కార్యక్రమం ప్రారంభం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ థియేటర్ సమీపంలోని రైస్ మిల్లు ఆవరణలో ఏలూరు అయ్యప్ప అన్న సమారాధనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సర్వ మాలధారులకు నవంబరు 19వ తేదీ వరకు నిత్య భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. మాలధారులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వామి, భవానీలు, గోవింద స్వాములు, శివ స్వాములు పాల్గొన్నారు. ప్రాంగణమంతా అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగింది.

రోగులకు ఇబ్బంది కలిగించొద్దు

భీమడోలు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యుల విధుల బహిష్కరణ నేపథ్యంలో వైద్యశాలల్లో రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి పి.జె.అమృతం సూచించారు. భీమడోలు మండలంలోని పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని డిఎంఅండ్‌హెచ్‌వో శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలో ఔట్ పేషెంట్లకు అందుతున్న సేవలను పరిశీలించారు. సేవలు క్రమంగా జరగాలన్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి వైద్యులు శ్రీ లక్ష్మీ వైద్య సేవలందించారు. ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.


జనసేన పార్టీలో చేరుతున్న జయ గంగ

జనసేన పార్టీలో చేరిన 11వ డివిజన్ కార్పొరేటర్

ఏలూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఏలూరులో వైసీపీకి ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. స్థానిక 11వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ కోయ జయగంగ, కోయ సత్తిబాబు దంపతులు జనసేన పార్టీలో చేరారు. వారితో పాటు ఆ డివిజన్, 13వ డివిజన్ నుంచి 200 ఆయన అనుచరులు జనసేన పార్టీలో చేరారు. జనసేనపార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పట్సమట్ల ధర్మరాజు,రాష్ట్ర వడ్డీ సంక్షేమ సంఘ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన పార్టీ ఏలూరు ఇంచార్జీ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. జనసేన నాయకుడు నారా శేషు, ఎమ్మెల్యే పట్సమట్ల ధర్మ రాజు, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి అనేక మంది పార్టీలో చేరుతున్నారని అన్నారు.

నేడు ఆటో డ్రైవర్ల ర్యాలీ.. పాల్గొననున్న మంత్రి సారథి

ఆగిరిపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 4న ప్రారంభించనున్న 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆగిరిపల్లి నుంచి వడ్లమాను వరకు నిర్వహించనున్న ఆటో ర్యాలీలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొననున్నారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు తెలిపారు.

నేడు కైకలూరులో ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం

కైకలూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ సేవలో కార్యక్రమాన్ని శనివారం ఉదయం 11గంటలకు కైకలూరు మార్కెట్ యార్డ్‌లో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ ఏవో కె బాలశంకరరావు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని అర్హులైన ఆటోడ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

నీట్ ర్యాంకర్ నిషితకు సత్కారం

మండవల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించింది ఓ పేదింటి విద్యార్థిని తొండమల్లి నిషిత. ఇటీవల నీట్ పరీక్షలో 3950 ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి కోటేశ్వర రావు బార్బర్‌షాపు నిర్వహిస్తూ పిల్లలను చదివించారు. పెద్ద కుమార్తె నిషిత పదో తరగతిలో పదికి పది పాయింట్లు, ఇంటర్‌లో 1000కి 909 మార్కులు సాధించింది. డాక్టర్ చదవాలనే లక్ష్యంతో కష్టపడి చదివి నీట్‌లో మంచి ర్యాంకు సాధించింది. నిషితను టీడీపీ నాయకులు ముళ్లపూడి సత్తి బాబు, గుడివాడ విజయ్‌గణేష్, శివయ్య, చంద్రశేఖర్ శుక్రవారం సత్కరించారు.

పురుషుల భాగస్వామ్యం కీలకం

ముసునూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గర్భవతులు, మహిళలు, వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ పోషణ మహోత్సవాల్లో పురుషుల భాగస్వామ్యం కీలమని ఐసీడీయస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ ఛాంపియన్లుగా ఎంపిక చేసిన పురుషులను ఘనంగా సన్మానించారు. పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వారిని సూపర్‌వైజర్ కోరారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ వితరణ

కలిదిండి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పెదలంకలో శుక్రవారం పీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పిళ్లారిశెట్టి వెంకట రమేష్‌బాబు మెరిట్ విద్యార్థులకు రూ.2.40 లక్షలు స్కాలర్ షిప్ పంపిణీ చేశారు. మొత్తం 12 మంది మెరిట్ విద్యార్థులను గుర్తించి ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున చెక్కులను అందించారు. మండల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు అక్కల వెంకటాచలం, నాయకులు పోకల ప్రసాద్, కోకా పాండురంగారావు, దున్న భోగేశ్వర రావు, ముద్దం వీరాస్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెటాస్ సేవలు మరింత విస్తృతం



నూజివీడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మెటాస్ సేవలను మరింత విస్తృతం చేస్తున్నట్టు ఆ సంస్థ సీఈవో అనిల్‌కుమార్ తెలిపారు. నూజివీడు అమెరికన్ ఆస్పత్రి, మెటాస్ నర్సింగ్ కాలేజ్, ఎస్‌డీఏ స్కూల్, జూనియర్ కళాశాలలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ సెవెన్త్ డే అడ్వెంటిస్ట్ (ఎస్‌డీఏ) చర్చిలకు అనుబంధంగా ఉన్న జీఎంహెచ్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాల్లో ప్రముఖ డాక్టర్లు ఉన్నారని, త్వరలో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు గ్లకోమా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. అమెరికన్ ఆస్పత్రిని ప్రారంభించి వచ్చే సంవత్సరానికి వందేళ్ల పూర్తి కావస్తుండడంతో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కృత్రిమ కాళ్ల అందజేత

ఆగిరిపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ తరువాత కూడా సమాజ సేవ కొనసాగించడం అభినందనీయమని హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ అన్నారు. తోటపల్లిలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని విజయవాడ ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ఆర్థిక సాయంతో నెల్లూరుకు చెందిన యడమకంటి శ్రీనివాసులు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన యడ్ల స్వర్ణకుమారికి కృత్రిమ కాళ్ళను అందజేశారని తెలిపారు. ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్. రామకృష్ణారావు, జి. కృష్ణమూర్తి, కె. రమేష్‌బాబు, వీవీఎస్ ప్రసాద్‌బాబు, కేసీహెచ్ యతిరాజు పాల్గొన్నారు.

క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ముసునూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పశువులను సంరక్షించేందుకు ప్రభుత్వం క్యాటిల్ షెడ్ల నిర్మాణాలకు లక్షలాది నిధులను ఖర్చు చేస్తోందని, సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, పీఏసీయస్ అధ్యక్షుడు కాటేపల్లి వెంకట సూర్యప్రసాద్ అన్నారు. శుక్రవారం చెక్కపల్లి పంచాయతీకి మంజూరైన నాలుగు షెడ్ల నిర్మాణాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. ఏపీవో రోజ్‌లీల మాట్లాడుతూ ప్రభుత్వం మండలంలో 40 షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. ఎంపీటీసీ పుష్పావతి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి స్థాపనే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

చాట్రాయి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మానవ సమైక్యత, ప్రపంచ శాంతి, సంఘటిత హిందూ సమాజ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని సమితి ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ మాలపాటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు దెందుకూరు దుర్గాప్రసాద్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా చాట్రాయి వికాస్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వీరు మాటాడారు. బస్తీ ప్రముఖ్ జి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెన్నారెడ్డి, సంజీవరెడ్డి, వేణుగోపాలరెడ్డి, ఆదిమూలం శర్మ, ఇజ్జిగిరి కేశవ, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో.. సాధించారు

(5వ పేజీ తరువాయి)

భాస్కరరావు, కొడవకంటి సునీత, జంగారెడ్డిగూడెంలో దోసూరి మంగమ్మ, చింతలపూడిలో ఎస్.వరకుమార్.

● ఉత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడరులుగా చేబ్రోలుకు చెందిన ఎల్.ప్రసాదరావు, సింగగూడెంకు చెందిన శీకాకాలు పుల్లయ్య, వేదాంతపురానికి చెందిన జొన్నకూటి ఏసు, పోతురెడ్డి పల్లికి చెందిన రెడ్డి కొడనాల రామయ్య అవార్డులను సాధించారని కలెక్టర్ వివరించారు.

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈనెల 6న జరిగే రాష్ట్రస్థాయి అవార్డులు ప్రదానం జరుగుతుందని, అదే రోజు ఏలూరులో స్వచ్ఛాంధ్ర అవార్డులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో అందించి సత్కరిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీహరి పాల్గొన్నారు.

నేడు వైద్యుల చలో విజయవాడ

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థిస్తూ ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడిజిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, సెక్రటరీ ఎన్.రామారావు, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్‌లకు వైద్యుల సంఘం జిల్లా నాయకులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ జోషిమా, డాక్టర్ బాలు, డాక్టర్ రాజీవ్, డాక్టర్ రోహిత్, తదితరులు శుక్రవారం ఏలూరులో వినతిపత్రాన్ని అందజేశారు. కాగా ఏలూరులో నిర్వహించిన నిరసన శిబిరంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్, పీహెచ్‌సీల్లో పనిచేసే సుమారు 70 మంది మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

చీటీల పేరిట రూ.రెండున్నర కోట్లకు టోకరా..!

(5వ పేజీ తరువాయి)

కట్టారు. చీటీ పాడుకున్న ప్పటికి డబ్బులు ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి అతన్ని నిలదీస్తే వాయిదాలు వేస్తున్నాడు. చివరకు తన వద్ద డబ్బులు లేవంటూ ఐపీ నోటీసులు పంపుతున్నాడని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తమకు సుమారు రెండున్నర కోట్ల వరకు చెల్లించాల్సి వుందని ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిన్నకల్లుకు చెందిన గోపిరాజు, నూజి వీడుకు చెందిన బి.దావీదు నేతృత్వంలో 52 మంది ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సత్యశ్రీనివాస్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	242
చికెన్ స్కిన్‌లెస్	252
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



మట్టగుంటలో అమ్మవారి తెప్పోత్సవం



కోటపాడులో దుర్గమ్మ ఊరేగింపు

జయహో దుర్గాభవాని

» ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

» ఆంధ్రా మైసూర్ నూజివీడులో అంబరాన్నంటిన సంబరాలు



అన్నవరంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వినోద్ పూజలు



శ్రీశ్యామలాంబ ఆలయంలో భజనలు



అక్కిరెడ్డిగూడెంలో దుర్గమ్మ

కైకలూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పుష్పశయన పూజలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు జంపన రామ లింగరాజు, సుజాత దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అట పాకలో దుర్గమ్మ ఊరేగింపు ఘనంగా జరిగింది. గురువారం మండలంలో విజయదశమిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అలాగే గోప వరం, ఆలపాడు, తదితర గ్రామాల్లో రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై అమ్మవారి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

నూజివీడు టౌన్: ఆంధ్రా మైసూరుగా పేరుగాంచిన నూజివీడులో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. నూజివీడు కోట మహిషాసుర మర్ధిని, దుర్గామల్లేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, వెంకటాచలస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు నగరోత్సవం నిర్వహించారు. అమ్మవారిని గురువారం రాత్రి మంత్రి కొలుసు పార్థసారథి సతీసమేతంగా పూజలు నిర్వహించారు. ఇంకా జిల్లా ఎస్పీ కిషోర్, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, సీఐలు సత్యశ్రీనివాస్, రామకృష్ణ అమ్మవారికి పూజలు నిర్వహించడంతో పాటు సంప్రదాయ ఆయుధపూజ సైతం నిర్వహించారు.

చాట్రాయి: మండలంలోని కోటపాడు, ఆరుగొలనుపేట, చనుబండ గ్రామాల్లో గురువారం దుర్గమ్మ విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. చాట్రాయి, బూరుగుగూడెం, పర్వతాపురం, చనుబండ, ఆరుగొలనుపేట తదితర గ్రామాల్లో గురువారం మహిళలు బతుకమ్మలను తలపై పెట్టుకొని ఊరేగించి నిమజ్జనం చేశారు.

ముసునూరు: ముసునూరు, అక్కిరెడ్డిగూడెం, గోపవరం తదితర గ్రామాల్లో అమ్మవారికి పూజలు చేసి, వైభవంగా గ్రామోత్సవాలు నిర్వహించి, నిమజ్జనాలు చేశారు. ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.చిరంజీవి దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. బలివే శ్రీ రాజ రాజేశ్వరికి ఆలయ చైర్మన్ బి.శ్యామలరావు, ఈవో పి.సీతారామయ్య పూజలు చేసి, అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మెట్ల కోనేరు సమీపంలోని దుర్గమ్మవారిని గురువారం ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు దేవులపల్లి శ్రీనివాస్ మూర్తి రాజరాజేశ్వరిగా అలంకరించి పూజలు చేశారు. భారీ అన్నసమారాధన జరిగింది.

ముదినేపల్లి: దేవపూడిలో శుక్రవారం శివ పార్వతుల రథోత్సవం వైభవంగా జరిగింది. అన్నవరంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ పాల్గొని పూజలు జరిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వణుదుర్రులో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అమ్మవారికి పూజలు జరిపారు. శ్రీహరిపురం గంగానమ్మ ఆలయం వద్ద మహిళలు బతుకమ్మ సంబరం నిర్వహించారు.

కలిదిండి: మట్టగుంట దుర్గమ్మ రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని ఉప్పుటేరులో హంస వాహనంపై బాణా సంచా కాల్చుతూ తెప్పోత్సవం నిర్వహించారు.



వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం



బుట్టబొమ్మల ప్రదర్శన



కోట మహిషమ్మకు మంత్రి సారథి, ఎస్పీ పూజలు



సమగ్ర ప్రణాళికతోనే గ్రామాభివృద్ధి

ముదినేపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ముందస్తు ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి, మండవల్లి మండలాల్లోని పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో వై.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలను పంచాయతీల కార్యదర్శులు రూపొందించాలని తెలిపారు.

నేడు కలిదిండి మండల సమావేశం

కలిదిండి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన ఈ నెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడివో ఆర్.ఫణీంద్ర తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీమా పరిహారం అందజేత

చాట్రాయి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పోలవరం యూనియన్ బ్యాంకు ఖాతాదారుడైన మంకొల్లుకు చెందిన శెట్టిపల్లి శ్రీనివాసరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతను పీఎంజెజెబీవై పాలసీదారు కావటంతో రూ. 2 లక్షల బీమా చెక్కును శుక్రవారం మేనేజర్ రఘుబాబు అందించారు.





ముసునూరులో ట్రాక్టర్ ర్యాలీ.. కలిదిండిలో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు

సూపర్ జీఎస్టీతో రైతాంగానికి మేలు

ముసునూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీతో రైతాంగానికి మేలు చేకూరుతుందని మండల టీడీపీ అధ్యక్షులు గద్దె రఘుబాబు, నూజివీడు ఇన్‌చార్జ్ ఏడీఏ వై.సుబ్బారావు అన్నారు. శుక్రవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై వ్యవసాయ అధికారిణి ఏ.చాముండేశ్వరీ ఆధ్వర్యంలో ముసునూరులో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. తొలుత వ్యవసాయ పరికాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, తగ్గించిన జీఎస్టీ వల్ల ఏ పరికరానికి ఎంత నగదు అదా అవుతుందో ఏవో వివరించారు. అవగహన సదస్సులో రఘుబాబు, డీసీ చైర్మన్ రావర్ల బాలకృష్ణ, ఏడీఏ తదితరులు మాట్లాడుతూ ఎరువులు, ముడి సరుకులకు సైతం జీఎస్టీని తగ్గించారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలతోపాటు రైతులకు ఈ సూపర్ జీఎస్టీ వల్ల ఆర్థికభారం తగ్గిందన్నారు. తగ్గించిన జీఎస్టీ ప్రజలకు అవగహన కల్పించేందుకు ఈ నెల 19వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు శాఖల వారిగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం గ్రామ పురవీదుల్లో సూమారు 100 ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో డిప్యూటీ ఎంపిడివో బి.ఏ సత్యనారయణ, పీఏసీయస్ అధ్యక్షులు దేవినేని శ్రీదర్, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, కూటమి నాయకులు తులిమెల్లి రంగరావు, పాశం నాగబాబు, బి.శ్రీకాంత్, నక్కా యోహాను, గ్రామ టీడీపీ అధ్యక్షులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కేంద్రం తగ్గించిన జీఎస్టీ వల్ల ప్రజలకు కలిగే ఉపయోగాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కలిదిండి సెంటర్‌లో టీడీపీ కలిదిండి మండల నాయకుల ఆధ్వర్యంలో కలిదిండి మెయిన్ సెంటర్‌లో పలు షాపులకు వెళ్లి జీఎస్టీ తగ్గుదల వల్ల కలుగు ప్రయోజనాలను వివరించారు. నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు పాల్గొన్నారు.



కైకలూరులో గాంధీ విగ్రహానికి నివాళులు



ఆగిరిపల్లిలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధుల నివాళి



ముసునూరులో సర్పంచ్ నివాళి

గాంధీజీకి ఘన నివాళులు

కైకలూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గాంధీజయంతి వేడుకలను కైకలూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. కూటమి నేతల ఆధ్వర్యంలో కైకలూరులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో తాలుకా సెంటర్లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో-కన్వీనర్లు కమ్మిలి విఠలరావు, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వీజేఎస్ మాల్యాద్రి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, కూటమి నేతలు ఎండీ జానీ, పైడిమర్రి రాధాకృష్ణ, బీసీ సంఘాల నాయకులు గంగునేని వరప్రసాద్, బీకేఎం నాని, పూల రామచంద్రరావు, వైస్ ఎంపీపీలు మంగినేని రామకృష్ణ, గంగుల వెంకట నరసనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి బీజేపీ జిల్లా కో-కన్వీనర్ కోటప్రోలు కృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మీ, నాయకులు మహాత్ముడికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీహరిపురంలోని గాంధీ మందిరంలో గాంధీజీ, కస్తూర్బా, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నవరంలో గాంధీజీ విగ్రహానికి విద్యావేత్త కొత్తూరు వెంకట సుబ్బారావు నివాళులర్పించారు.

ముసునూరు: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా అన్నారు. గురువారం ముసునూరు సచివాలయంలో గాంధీ చిత్రపటానికి సర్పంచ్, కార్యదర్శి వెంకటేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం. చిరంజీవి, మండల కార్యాలయంలో ఎంపీడీవో పి.ఏసుబాబు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, అక్కిరెడ్డిగూడెంలో సర్పంచ్ పులిబక్క లక్ష్మీ సత్యనారాయణ నివాళులర్పించారు. గాంధీజీ పోరాటాలు, సేవలను కొనియాడారు. నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్, బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యోహాను తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చాట్రాయి, చనుబండ గ్రామాల్లో గురువారం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యం కోసం వారు చేసిన కృషిని కొనియాడారు. కూటమి నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, నక్కా రాము, బుర్రి శ్రీకర్, నెక్కలపు వెంకటేశ్వరరావు, ఆదిమూలం శర్మ, తుమ్మల జగన్, చీదిరాల మారేశ్వరరావు, కందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: మట్టగుంటలో కూటమి నాయకులు గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, సర్పంచ్ అండ్రాజు రత్నమణి, నాయకులు వడుగు గణపతి, కె.ఉమామహేశ్వరరావు, కొప్పనాతి వెంకటేశ్వరరావు, ఈశ్వర పరశురాముడు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మడుపల్లి గోపాల్, చలువాది వెంకటరత్నం, కె ముక్తేశ్వరరావు, జె. చంద్రమౌళి, వై. శివరామ్, జె. మారుతి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారి విహారం

ముసునూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముసునూరులోని శ్రీ వేంకటా చల స్వామి గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో విహరించారు. విజయదశమి సందర్భంగా స్వామి వారికి ఆలయ చైర్మన్ దేవినేని వరప్రసాదరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీయస్ అధ్యక్షుడు దేవినేని శ్రీధర్, రేగుల రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

వెండి కవచం బహూకరణ

చాట్రాయి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగొలనుపేట శ్రీలక్ష్మమ్మ, అంకమ్మ వార్లకు హైదరాబాద్‌కు చెందిన వల్లేటి నరసింహారావు, లలితశ్రీ దంపతులు రూ. 2.50 లక్షలు విలువైన వెండి కవచాన్ని గురువారం ఆలయ కమిటీకి అందజేశారు. దాతలకు పూజారులు ఆశ్వీరచనాలు అందజేసి సన్మానించారు.

బాబా సమాధి పూజలు

ముదినేపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో బాబా సమాధి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాబా విగ్రహంపై పుష్పాలు ఉంచి సమాధి పూజలు జరిపించారు. మందిరం చైర్మన్‌గా పరసా ఏడుకొండలు, వైస్ చైర్మన్ నీలం నరసింహారావు ఆధ్వర్యంలో భక్తులు బాబాకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చేవూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాతూరి మల్లిఖార్జునరావు, నీలం సుబ్బారావు దంపతులు బాబాకు పూజలు నిర్వహించారు.

వణుదుర్రులో చౌకడిపో ప్రారంభం

ముదినేపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వణుదుర్రులో ప్రభుత్వ చౌకధరల దుకాణాన్ని శుక్ర వారం మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు పేదలకు మరింత ప్రయోజనం కలిగించనున్నాయని తెలిపారు. టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రవి కుమార్, బీజేపీ జిల్లా కో-కన్వీనర్ కోటప్రోలు కృష్ణారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వీరమల్లు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మండవల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రొయ్యల చెరువు వద్ద కూలి పనికి వెళ్లి విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండవల్లి మండలంలో గురువారం జరిగింది. దేవిచింతపాడుకు చెందిన భాను(25) కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం రొయ్యల చెరువుపై ఫ్యాన్ రెక్కలు బిగించేందుకు పనికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఇతను ఈ మధ్యే ప్రేమ వివాహం చేసుకున్నాడు. మృతదేహానికి కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి గురువారం బంధువులకు అప్పగించారు. ఎస్సై రామచంద్రరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఊరేగింపులో వ్యక్తిపై కర్రతో దాడి

కైకలూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఊరేగింపులో వ్యక్తిపై కర్రతో దాడి చేసిన ఘటనపై కైకలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం గురువారం రాత్రి కైకలూరు మండలం నరసాయిపాలెంలో దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఊరేగింపు జరుగుతోంది. పాత గొడవలను పురస్కరించుకుని బోయిన ప్రకాష్‌పై అదే గ్రామానికి చెందిన మాడపాటి రమేష్ కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ప్రకాష్‌ను అతని కుటుంబీకులు కైకలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి అక్కడి నుంచి విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రకాష్ తండ్రి ఫిర్యాదుపై ఏఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

ముదినేపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భర్త చనిపోయాడన్న మనోవేదనతో ఓ వృద్ధురాలు ఇంటి నుంచి వెళ్ళిపోయిన ఘటన శుక్రవారం ముదినేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన వీరంకి సాంబయ్య (70) ఈ ఏడాది జూలై 25న అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి అతని భార్య విమల (65) మనోవేదనతో తరచూ ఇంటి నుంచి వెళ్ళిపోతుండడంతో కుటుంబ సభ్యులు వెతికి తీసుకొస్తున్నారు. శుక్రవారం కూడా ఆమె ఇంటి నుంచి వెళ్ళి పోయింది. గ్రామంలో ఆమె కోసం వెతికినా కనిపించలేదు. చివరికి పోల్‌రాజ్ కాల్వ వద్దకు వెళ్ళి ఆరా తీయగా ఒక వృద్ధురాలు కాల్వలో దిగి నీటిలో కొట్టుకు పోవడం తాము చూశామని కొందరు చెప్పగా, ఆ వృద్ధురాలు తన తల్లి అయివుంటుందన్న అనుమానంతో ఆమె కుమార్తె గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

కాపురానికి రమ్మన్నందుకు దాడి

ముదినేపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన పి.నాగార్జునకు, అదే గ్రామానికి చెందిన చంద్రకాంతికి 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఇటీవల ఆమె పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. పిల్లలు దసరా సెలవులకు రావడంతో ఇంటికి రమ్మని భర్త ఫోన్ చేయగా, భార్య చంద్రకాంతి, ఆమె బంధువులు నాగార్జున, ఆమె తల్లిని దుర్భాషలాడుతూ దాడి చేశారు. దీంతో వారు కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, గురువారం ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాను ఢీకొని గాయాలు

కలిదిండి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పడమటిపాలెం గ్రామానికి చెందిన కట్టా వినయ్ (23) గురువారం కలిదిండి నుంచి పడమటిపాలెం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా, జడ్పీ హైస్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వ్యాను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇతనిని భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వ్యాను డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.